




కళారాల ఉత్సవం.. పులకించిన భక్తజనం



అశ్వ వాహనంపై సిద్ధిదాయనిగా బాలాత్రిపురసుందరీదేవి

దేవతా వేషధారణలు.. కేరళ వాయిద్యాలు.. కళాకారుల గీతాలాపనలు.. హోరెత్తించే డీజే పాటలు.. యువత నృత్యాలు.. బాణసంచా మోతలు.. డప్పు దరువుల మధ్య ఒంగోలు నగరంలో కళారాల ఉత్సవం కనులపండువగా సాగింది. మొదటి రోజైన గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలాజీరావుపేట నుంచి కనకదుర్గాదేవి, బీవీఎస్ హాల్ సెంటర్ నుంచి నరసింహస్వామి, అంకమ్మపాలెం నుంచి కాళికామాత కళాకారాలు ఉత్సవానికి బయలుదేరాయి. నగరంలోని పలు మార్గాల మీదుగా పయనించాయి. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి, బిందెలతో వారు పోసి తమను చల్లగా చూడాలంటూ వేడుకున్నారు. తెల్లవారుజామున మస్తాన్ దర్గా కూడలికి చేరుకున్నాయి. ఒంగోలుతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కళారాలను వీక్షించి తన్మయత్వం చెందారు. – న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



ఒంగోలులో దాండియా, గర్బా నృత్యం చేస్తున్న బిగ్‌బాస్ ఫేం శుభశ్రీ, కళాకారులు, యువత



కళారాల ఊరేగింపులో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, నగర వాసులు

వరాల 'సిద్ధిదాయని': దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీదేవి, త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాల్లో సిద్ధిదాయని అలంకరణలో అశ్వ వాహనంపై బాలాత్రిపురసుందరీదేవి శుక్రవారం దర్శనమిచ్చారు. మహార్నవమి కావడంతో రాత్రి వేళ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. – న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

మహిళలే మహాలక్ష్ములు

- 1.23 లక్షల మంది లఖ్‌పతి దీదీలే లక్ష్యం
- మార్చి నెలాఖరులోపు రుణ ప్రణాళికలు

మహిళాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది లఖ్ పతి దీదీ పథకాన్ని కొత్తగా అమల్లోకి తెచ్చాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 1.23 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణం ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించాయి. ఈ మేరకు లబ్ధిదారులను గుర్తించి సదరు వివరాలను జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. వీరికి ప్రస్తుతం నిర్వహిస్తున్న స్వయం ఉపాధి యూనిట్ల విస్తరణకు అవసరమైన రుణాన్ని రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు మార్చి నెలాఖరు లోపు అందించనున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



కొత్తపట్నంలో సమావేశమైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

ఇటు వృద్ధి.. అటు ఉపాధి...: ప్రతి స్వయం సహాయక సంఘంలోనూ 8 నుంచి 10 మంది వరకు మహిళలు ఉన్నారు. బ్యాంక్ లింకేజీ కింద ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం ఇస్తుండగా; సదరు సంఘాలు ఏటా సుమారు రూ.3 వేల కోట్ల మేర రుణాలు తీసుకుంటున్నాయి. వీటితో పచ్చళ్లు, అగరవత్తులు, కాగితపు ప్లేట్లు, టీ కప్పులు, యాసిడ్, ఫినాయిల్, కర్పూరం తయారీ నుంచి ఆహార శుద్ధి యూనిట్ల వరకు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ చేస్తూ ఆర్థికాభివృద్ధి చెందడంతో పాటు, మరో నలుగురికి ఉపాధి చూపుతున్నారు.



భారంగా మార్చిన గత పాలకులు...

గత ప్రభుత్వం అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేస్తామంటూ ప్రగల్భాలు పలికింది. కేవలం రూ.3 లక్షల రుణానికే సున్నా వడ్డీ పథకం అమలు చేసింది. మిగతా రుణానికి పూర్తి వడ్డీ చెల్లించాల్సి రావడంతో సంఘాలకు భారంగా మారింది. 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గరిష్ఠంగా సంఘానికి రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చింది. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఎంఎస్‌వై పథకాల ద్వారా రుణాలపై 35 శాతం రాయితీ వర్తింపజేయనున్నారు. వీటితో సంబంధం లేకుండా లఖ్‌పతి దీదీ కింద ష్యూరిటీ పత్రాలు అవసరం లేకుండానే అదనపు రుణాలు ఇచ్చేందుకూ జిల్లాలోని అన్ని బ్యాంకుల వారీగా లక్ష్యాలు కేటాయించారు. ఈ రుణాలు మహిళల జీవనోపాధులకు ఆసరాగా నిలవనున్నాయి.

స్వయం సహాయక సంఘాలిలా...	
జిల్లాలోని మండలాలు:	38
గ్రామ సమాఖ్య సంఘాలు:	1,534
స్వయం సహాయక సంఘాలు:	44,320
అందులో మొత్తం మహిళలు:	4,46,776

ధరాఘాతానికి విరుగుడు.. తక్కువకు దుకాణాల్లో నూనెలు

ఒంగోలు గ్రామీణం, ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: జిల్లాలోని 55 ప్రత్యేక కౌంటర్ల ద్వారా 1,243 వంట నూనె ప్యాకెట్లను తక్కువ ధరకే శుక్రవారం విక్రయించినట్లు సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం వంట నూనె, ఉల్లిపాయలు, టమోటా ధరలు పెరిగిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు తక్షణ చర్యల కింద తక్కువ ధరకు అమ్మకాలు చేపట్టినట్లు వివరించారు. పామోలిన్(లీటరు) రూ.110; సన్‌ఫ్లవర్ ఆయిల్(లీటరు) రూ.124 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కేంద్రాల ద్వారా ఇప్పటివరకు ఉల్లిపాయలు 1,275 కిలోలు, టమోటా 1,200 కిలోలు విక్రయించినట్లు వివరించారు.

కొత్తపట్నంలో దుకాణాల తనిఖీ...: తక్కువ ధరకు నూనె ప్యాకెట్లు విక్రయిస్తున్న కొత్తపట్నంలోని హేమంత్ ప్రొవిజన్స్, బాలాజీ ప్రొవిజన్స్ దుకాణాలను ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తనిఖీ చేశారు. ఆమె వెంట ఆర్ఐ వరకుమార్, వీఆర్వోలు ఉన్నారు.

మద్యం దరఖాస్తుల ఆదాయం రూ.68 కోట్లు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాలకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు దాఖలు కాలేదు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయానికి జిల్లాలోని 171 దుకాణాలకు 3,416 దరఖాస్తులు అందాయి. వీటి ద్వారా నాన్ రీఫండబుల్ రుసుము రూ.68.32 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. వాస్తవానికి పోటీ తీవ్రంగా ఉంటుందనీ, అయిదు వేలకు పైగా దరఖాస్తులు వస్తాయని, దరఖాస్తు రుసుము రూపేణా రూ.వంద కోట్ల వరకు ఖజానాకు సమకూరుతాయని ఎక్సైజ్ శాఖ అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురయ్యాయి. కూటమి కట్టిన కొందరు నేతలు దరఖాస్తు చేసేవారిని అడ్డుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోటీ లేక దరఖాస్తులు భారీగా తగ్గాయి. నాన్ రీఫండబుల్ రుసుము కూడా రూ.68 కోట్ల వద్దే ఆగిపోయింది.

సర్కిల్	దుకాణాలు	దరఖాస్తులు
ఒంగోలు	34	590
చీమకుర్తి	16	351
సింగరాయకొండ	14	385
పొదిలి	16	291
దర్శి	23	375
మార్కాపురం	13	320
కనిగిరి	19	387
గిద్దలూరు	13	231
కంభం	10	239
యర్రగొండపాలెం	13	247
మొత్తం	171	3,416

బ్యాటరీల దొంగల్ని వదలం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం మండలం నల్లమల అడవిలోని పాలుట్ల, దద్దనాల తదితర చెంచు గిరిజన గూడేలకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించారు. అనంతరం వైకాపా పాలనలో ఇందుకు సంబంధించిన రూ. 40 లక్షల విలువైన 600 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఈ విషయాన్ని వై.పాలెం పర్యటనకు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి స్థానికులు గురువారం తీసుకెళ్లారు. దీంతో పోలీసు అధికారులు స్పందించారు. విద్యుత్తు ఏఈ అల్లూరయ్య ఫిర్యాదు మేరకు పాలుట్లకు చెందిన సురేష్ నాయక్, సురేంద్ర నాయక్, హనుమా నాయక్, అంజి నాయక్‌లపై శుక్రవారం కేసు నమోదు చేశారు. కేసును ఎస్సై చౌడయ్య దర్యాప్తు చేయనున్నట్లు వై.పాలెం సీఐ ప్రభాకరరావు తెలిపారు. నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. బ్యాటరీలు ఎవరికి విక్రయించిందీ తెలుసుకుంటామని, చోరీకి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదలమని చెప్పారు.

ఒంగోలులో అత్యధిక వర్షపాతం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. మండలాల వారీగా ఒంగోలు 45.2 మి.మీ; పుల్లలచెరువు 41.8 మి.మీ; నాగులుప్పలపాడు 40.4 మి.మీ; తాళ్లూరు 38.2 మి.మీ; మద్దిపాడు 37.2 మి.మీ; టంగుటూరు 36.4 మి.మీ; దొనకొండ 31.0 మి.మీ; కనిగిరి 30.6 మి.మీ; యర్రగొండపాలెం 28.0 మి.మీ; సంతనూతలపాడు 26.6 మి.మీ; త్రిపురాంతకం 25.2 మి.మీ; మార్కాపురం 24.6 మి.మీ; కొనకనమిట్ల 24.2 మి.మీ; హనుమంతునిపాడు 24.0 మి.మీ; చీమకుర్తి 22.4 మి.మీ; ముండ్లమూరు, తర్లుపాడు 20.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఒంగోలు నగరంలో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పలు చోట్ల సాగు చేసిన పొగాకు, మిర్చి చేలలో నీళ్లు నిలిచింది.

ఎగజిమ్ముతున్న నిర్లక్ష్యం



అసలే చుక్క నీటి కోసం పరితపించే జిల్లాలో నిర్లక్ష్యం ఎగజిమ్ముతోంది. గత పది రోజులుగా గుండ్లకమ్మ జలం నేల పాలవుతోంది. జలాశయం నుంచి ఒంగోలు పట్టణానికి మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ మద్దిపాడులోని ఫ్లైఓవర్ వద్ద లీక్ అవుతోంది. గత పది రోజుల నుంచీ కళ్లెదుటే సమస్య కనబడుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

–న్యూస్‌టుడే, మద్దిపాడు

స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సాగర్ జలాలు నిత్యం పెద్ద ఎత్తున లీకై వృథాగా పోతున్నాయి. గత కొన్ని రోజులుగా ఇలా నేల పాలవుతున్నా యంత్రాంగం స్పందించడం లేదని స్థానికుడు రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

–న్యూస్‌టుడే, కొనకనమిట్ల



వరద బాధితులకు రూ.8.81 లక్షల సాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు ఒంగోలు నగర దాతలు రూ.8,81,748 విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు చెక్కులిచ్చారు. ఆ మొత్తాన్ని ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు అందజేశారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ తదితరులు

వేణుగోపాల స్వామి కమిటీ చేయూత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు గిద్దలూరు వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు అండగా నిలిచారు. ఈ మేరకు వారు శుక్రవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేతికి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులకు దేవస్థాన కమిటీ నిర్వాహకులు చేయూతనందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాతలు బైలడుగు బాలయ్య, బుడతా మధుసూదన్‌రావు, పల్లా రమేష్, నంద్యాల శ్రీనివాసులు, మొరిశ బాలగురవయ్య, రవికాంత్, వేణుగోపాల్, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

ఒంగోలు క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ మిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దీనికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 360మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తుందన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు సీఎంగా పనిచేసిన కాలంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జాతీయ క్రీడలను నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్రమశిక్షణతో క్రీడల్లో రాణిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ముందుకుసాగాలని సూచించారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 13 వరకూ కొనసాగనుంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులతో మినీ స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. తొలిరోజు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. టోర్నీ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.రాజరాజేశ్వరి, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.




పోటీపడుతున్న ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిణి ధృతి

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఒంగోలు గ్రామీణం: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష నిమిత్తం మూడు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పైసలడిగితే సాగనంపుతాం

- గోడ ప్రతి ఏర్పాటు
- పూర్వ ఏవో శివప్రసాద్ సస్పెన్షన్



డీపీవో కార్యాలయంలో అంటించిన పోస్టర్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సచివాలయ కార్యదర్శుల బదిలీల్లో అవినీతిపై ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. అధికారులు ఆగమేఘాల మీద దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఓ అధికారిపై వేటు వేయడంతో పాటు, కార్యాలయం వద్ద గోడ ప్రతిని ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల ఉద్యోగుల బదిలీల్లో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించి డీపీవో కార్యాలయం పూర్వ ఏవో ఎన్.శివప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం నుంచి శుక్రవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులందాయి. బదిలీల విషయంలో ఇప్పటికే డీపీవో కార్యాలయ జూనియర్ సహాయకుడు ఎం.వీ.కిషోర్, డిజిటల్ సహాయకుడు పి.సాయి కోటేశ్వరరావును సస్పెండ్ చేశారు. ఈ దందాపై 'ఈనాడు'లో 'నగదు ఇవ్వు..లేఖ తీసుకెళ్లు' శీర్షికన ఆదివారం ప్రచురితమైన నాటి నుంచి విచారణ జరుపుతున్న అధికారులు బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నారు. మరోపక్క అవినీతి నిరోధక చట్టం ప్రకారం సదరు ముగ్గురు ఉద్యోగులపైనా క్రిమినల్ చర్యల నిమిత్తం డీపీవో జీవీ.నాయుడు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయం గోడపై 'ఇది ప్రభుత్వ కార్యాలయం. .పనిచేయడం మా విధి, పని చేయించుకోవడం మీ హక్కు. డబ్బుతో ప్రలోభ పెట్టకండి' అంటూ గోడపత్రాన్ని అతికించారు.

ఈనాడు కథనానికి స్పందన



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి, చిత్రంలో డీఈవో పద్మావతి తదితరులు

బాలికా సంరక్షణే ధ్యేయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామనగర్‌లోని చైతన్య స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణతో పాటు, బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసం 'బంగారు బాల్యం' పేరిట కొత్త కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారన్నారు. డీఈవో సుభద్ర మాట్లాడుతూ... విద్యతోనే భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. సీఐ సూర్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

అటవీ అధికారుల తీరుపై నిరసన

మార్కాపురం: అటవీశాఖ అధికారులు తమ వారిని అక్రమంగా అరెస్టు చేశారంటూ దోర్నాల, జమ్మిదోర్నాల, యర్రగొండపాలెం, వెంకటాద్రిపాలెం గ్రామస్థులు శుక్రవారం మార్కాపురం పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఇటీవల అలుగును వేటాడిన కేసులో మొత్తం 12 మంది నిందితులను అరెస్టు చేసి శుక్రవారం వారిని మార్కాపురం న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఈ నేపథ్యంలో బాధితులు పట్టణానికి వచ్చి నిరసన వ్యక్తంచేశారు. తమ వారిని అక్రమంగా అరెస్టుచేశారని ఆందోళన చేపట్టగా, పోలీసులు వారికి సర్దిచెప్పి పంపించేశారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించరూ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐకాస ఛైర్మన్ కె.సురేష్, కో ఛైర్మన్ కల్లూరి శ్రీనివాసులు శుక్రవారం విజయవాడలో మంత్రిని కలిసి మాట్లాడారు. ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఆగిపోయిందని, తిరిగి కొనసాగించి 3618 మందిని రెగ్యులర్ చేయాలని కోరారు. 250 ఒకేషనల్ జూనియర్ అధ్యాపకుల ఉద్యోగోన్నతుల్లో బోధనేతర సిబ్బందికి అవకాశం కల్పించడం వల్ల బోధనా సిబ్బందికి నష్టం వాటిల్లకుండా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. మంత్రిని కలసిన వారిలో పి.ప్రభుదాస్, బి.వీరయ్య తదితరులున్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఒప్పంద అధ్యాపక సంఘం ప్రతినిధులు

ఎయిడ్స్ నివారణపై విస్తృత అవగాహన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఎయిడ్స్‌ని నివారణలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన అవగాహన సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. ఎనిమిది అంశాలపై ఎనిమిది వారాలు వివిధ ప్రాంతాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించారు. 'హెల్ప్' స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశంలో 163 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రాష్ట్రంలో 2030 నాటికి ఎయిడ్స్ కేసులు సున్నా స్థాయికి తీసుకురావడం లక్ష్యమన్నారు. రోజుకో అంశంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్‌జానీ, కిరణ్, వ్యవస్థాపక అధ్యక్షులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పసికందు ఉసురు తీసిన పాషాణ హృదయం

న్యూస్‌టుడే, మార్కాపురం : పొత్తిళ్లలో వెచ్చగా నిదురించాల్సిన పసికందును ఓ పాషాణ హృదయం మృత్యుముఖంలోకి నెట్టింది. రోజులు కూడా నిండని ఆ చిన్నారి ఉసురుతీసింది. మానవత్వం మంటగలిసే ఈ సంఘటన మార్కాపురం పట్టణంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రంగనాయకులు వైద్యశాల వీధిలోని ఓ కాలువలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు మురుగును తొలగిస్తున్నారు. ఆ సమయంలో ఒక్క రోజు కూడా నిండని ఓ పసికందు మృతదేహాన్ని వారు డ్రైనేజీలో పడివుండగా, గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారమందించారు. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబుతో పాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గురువారం రాత్రి పుట్టిగా..శుక్రవారం తెల్లవారుజామున డ్రైనేజీలో పడేసి ఉంటారని భావిస్తున్నారు. పసికందుకు అంత్యక్రియలు నిర్వహించామని, సంఘటనపై విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తర్లుపాడు, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన తర్లుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామానికి చెందిన నల్లబోతుల పెద్ద కోటయ్య(75)కు మతిస్థిమితం లేదు. గురువారం సాయంత్రం తర్లుపాడు పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండేవారు. మతిస్థిమితం లేకపోవడంతో గురువారం అర్ధరాత్రి స్థానిక గ్రామీణ లూథరన్ పాఠశాల సమీపంలోని రైల్వేట్రాక్‌పైకి వెళ్లగా రైలు ఢీకొని మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. శుక్రవారం స్థానికులు గుర్తించి స్టేషన్ సిబ్బందికి సమాచారమందించారు. అనంతరం వచ్చిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

గొర్రెలు దొంగిలించే ముఠా అరెస్టు

- నిందితుల నుంచి రూ.2.05 లక్షల స్వాధీనం

దర్శి, న్యూస్‌టుడే: గొర్రెలు దొంగిలించే ముఠా సభ్యులను ముండ్లమూరు పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి దర్శి సీఐ రామారావు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. దర్శి, బేస్తవారపేట, నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవలకాలంలో గొర్రెల దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో దర్శి డీఎస్పీ పర్యవేక్షణలో దర్శి సీఐ, ముండ్లమూరు, దర్శి ఎస్సైలు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ముండ్లమూరు మండలం పులిపాడు శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గోవిందపల్లికి చెందిన పెనుగొండ కుళాయప్ప, అవుకు మండలం మెట్టుపల్లికి చెందిన ఎరుకలి చిన్న ఆంజనేయులు, బనగానపల్లికి చెందిన దేవరకొండ రమేష్‌గా గుర్తించారు. వీరు ముఠాగా ఏర్పడి గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.2.05 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. మరికొంతమంది కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ముండ్లమూరు, దర్శి ఎస్సైలు నాగరాజు, మురళి, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 125, రిటైల్ లైవ్ - 147, చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్- 243

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం


త్రిపురాంతకం గ్రామంలో : బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో బారులుదీరిన భక్తులు


కంభం : బాలాత్రిపురసుందరీదేవిగా కోట సత్యమాంబదేవి


గిద్దలూరు : వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు

వైభవంగా.. వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీ రాచర్ల రహదారిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలు రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన అంబవరం శ్రీనివాసరెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు స్వామివారి కళ్యాణోత్సవం చేపట్టారు. కళ్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదాత


యర్రగొండపాలెంలో రాజరాజేశ్వరిదేవిగా


పుల్లలచెరువులో మహిషాసురమర్దినిగా


పెద్దదోర్నాలలో చండీదేవి వాసవీమాత

వైభవంగా శరన్నవరాత్రులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారు ఆలయాల్లో పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి, లలిత సహస్ర నామా పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. బేస్తవారపేటలో అమ్మవారు శ్రీ మహిషాసురమర్దినిగా, పొదిలిలో భవానీ అలంకారంలో, యర్రగొండపాలెంలో రాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మగా కనిపించారు.


పొదిలిలో.. దుర్గగా

– న్యూస్‌టుడే బృందం


బేస్తవారపేటలో మహిషాసురమర్దినిగా..


మార్కాపురం పట్టణం: విజయలక్ష్మీగా


కంభం : మహంకాళిదేవిగా వాసవీమాత


విజయ దశమి శుభాకాంక్షలు

శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి



త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనేదుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసవలకీమూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్నిపవిత్రమైన ఈ శరన్నవరాత్రులతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి అమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి



సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అధిష్ఠాన దేవత, శ్రీగాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గా అంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని) రక్షించేది అని. గాయత్రికి పేరు. అలాగే ఛాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనం మాట్లాడే వాక్కే గాయత్రీ అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి




అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారం అటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవి తనబిడ్డమైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్ని ప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈ జీవకోటి నశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం. "బిక్షాందేహి కీపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"

శ్రీ మహాలక్ష్మీ దేవి




శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మి స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనే ఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనే ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)



చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకల విద్యలనూ ప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసే అలంకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగా లక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి అమ్మ అనుగ్రహాన్ని కానుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారు మూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి



త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టి త్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితా త్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్ని అనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో అదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)




అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురుకుమారుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణి సంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది. ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా కొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి



మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ శరీరాల్లోంచి దివ్య తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆ తేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ ఆయుదాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహరించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి



అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్టాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగా కొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ చెరకుగడను చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక. "చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"


మార్కాపురం : వంట నూనెలను పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు


గిద్దలూరులో విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నగర పంచాయతీ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోండి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : అక్రమ పద్ధతిలో తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న 20 మంది ఎటువంటి సమాచారం లేకుండా తొలగించడాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వ్యతిరేకించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్, సీఐటీయూ నాయకులు

అందుబాటులోకి నిత్యావసర వస్తువులు

మార్కాపురం, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు హోల్‌సేల్ దుకాణాల వద్ద తక్కువ ధరలకు విక్రయం చేయిస్తున్నట్లు తహసీల్దారు చిరంజీవి తెలిపారు. నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు విక్రయం చేసే కేంద్రాలను మార్కాపురం పట్టణంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెదేపా నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ కందుల రామిరెడ్డి పాల్గొని వినియోగదారులకు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దారు చిరంజీవి మాట్లాడుతూ మార్కాపురంలోని అయిదు సూపర్ మార్కెట్‌తోపాటు మరో 10 హోల్‌సేల్ దుకాణాల్లో ప్రారంభించినట్లు చెప్పారు. ▶ గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీ పెద్ద కూరగాయల మార్కెట్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు టమోటా, నూనె, ఉల్లిపాయలు విక్రయించే కేంద్రాన్ని శుక్రవారం రాత్రి నగర పంచాయతీ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. నూనె, టమోటా, ఉల్లిపాయలు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో ప్రభుత్వం టమోటా కేజీ రూ.50, ఉల్లిగడ్డలు కేజీ రూ.35, నూనె కేజీ రూ.124 వంతున విక్రయిస్తున్నట్లు తహసీల్దారు ఆంజనేయరెడ్డి తెలిపారు.

పట్టాలెక్కిన దశాబ్దాల కల

పొదిలి, న్యూస్‌టుడే :

● పొదిలి వరకు రైల్వేలైను నిర్మాణపనులు పూర్తి
● ట్రయల్ రన్‌తో ప్రజల్లో ఆనందం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతం మీదుగా పోయే నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. దర్శి నుంచి పొదిలి వరకు రైల్వేలైను నిర్మాణపనులు పూర్తవడంతో రైల్వే అధికారులు రెండు రోజుల క్రితం ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో పొదిలి ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా పొదిలి, దర్శి, కనిగిరి ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న రైలు కల నెరవేరబోతుంది. పొదిలి దర్శి వరకు పూర్తిగా నిర్మాణం పూర్తయింది. దర్శి నుంచి పొదిలి వరకు ట్రాక్ పనులు పూర్తవగా పొదిలిలో స్టేషన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సిగ్నల్ వ్యవస్థ, విద్యుదీకరణ పనులు జరుగాల్సి ఉంది. పొదిలి-కనిగిరి మార్గంలో ఇప్పటికే వంతెనల నిర్మాణం పూర్తయ్యాయి. ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏడు మండలాల మీదుగా...

నడికుడి -శ్రీకాళహస్తి కొత్త రైల్వే బ్రాడ్ గేజ్ నిర్మాణం 308.76 కిలోమీటర్లు కాగా ప్రకాశం జిల్లాలో 107 కిలోమీటర్ల దూరం నిర్మాణం చేయనున్నారు. జిల్లాలో ఏడు మండలాలకు చెందిన 32 రెవెన్యూ గ్రామాల మీదుగా సాగుతుంది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల-రొంపిచర్ల, రొంపిచర్ల-శ్యావల్యాపురం, శ్యావల్యాపురం నుంచి దర్శి వరకు పనులు పూర్తిచేసి ట్రయల్ రన్ చేశారు. ప్రస్తుతం దర్శి నుంచి - కనిగిరి వరకు 97 కిలోమీటర్లు, కనిగిరి-ఆత్మకూరు, ఆత్మకూరు-వెంకటగిరి, మీదుగా శ్రీకాళహస్తి వరకు కొత్త రైల్వేలైను నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



ట్రయల్ రన్ కోసం పొదిలికి వచ్చిన రైలు


పొదిలిలో నూతనంగా నిర్మించిన రైల్వేట్రాక్

మెరుగుపడనున్న రవాణా వ్యవస్థ

పశ్చిమ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాలైన పొదిలి, కనిగిరి, పామూరు, దర్శి ప్రాంతాలు రైల్వేలైను నిర్మాణంతో అభివృద్ధి కానున్నాయి. ఇక్కడ పండించిన పంటలను నేరుగా రైల్వే ద్వారా దగ్గరలోని రాజధాని విజయవాడ, అటు చెన్నై లాంటి పెద్ద పట్టణాలకు సులువుగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ ప్రాంతంలో ఉద్యానవన పంటలైన నిమ్మ, బత్తాయి పంటలు అధికంగా ఉన్నాయి. రవాణా వ్యవస్థ మెరుగుపడితే రైతులు నేరుగా పెద్ద పట్టణాలకు పంటను తీసుకెళ్లే అవకాశం ఉంది. కనిగిరి నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న నిమ్జ్‌కు రైల్వే లైన్ వల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. జాతీయ పారిశ్రామిక ఉత్పాదక మండలిలో తయారైన వస్తువులు రైల్వేలైన్ ద్వారా పెద్ద పట్టణాలకు నేరుగా తరలించవచ్చు. కురిచేడు, దర్శి, పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో పండించే ఆహార పంటల రవాణాకు కూడా అనువుగా ఉంటుంది. జిల్లాలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఒంగోలు రైల్వే లైను తరచూ వరదలు, వర్షాల సమయంలో దెబ్బతింటుంది. అటువంటప్పుడు ప్రత్యామ్నాయ మార్గంగా నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను ఉపయోగపడుతుంది. ప్రధానంగా సరకు రవాణాకు ఈ మార్గం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్గం పూర్తయితే విజయవాడ-చెన్నై మార్గంలో నడిచే సరుకు రవాణా చేసే రైళ్ల రద్దీ ఆ మార్గంలో తగ్గే అవకాశం ఉంది.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

పొదిలి, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పొదిలి ఆర్టీసీ హైదరాబాదు నుంచి పొదిలికి ఆరు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు సుందరరావు తెలిపారు. మూడు రోజులుగా హైదరాబాదు నుంచి పొదిలికి రెగ్యులర్‌గా తిరిగే తొమ్మిది సర్వీసులతో పాటు అదనంగా ఆరు సర్వీసులు తిరుగుతున్నాయని చెప్పారు. ఆదివారం రాత్రి పొదిలి నుంచి హైదరాబాదుకు అదనపు సర్వీసులు తిప్పుతున్నామని, ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా ఏడు సర్వీసులు రిజర్వేషన్ పూర్తయిందని పేర్కొన్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం

కంభం, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం పంచాయతీల్లో ఆర్భాటంగా ప్రారంభించిన హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో అవి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. రూ. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన భవనాలు పూర్తి కాకపోవడంతో పాడైపోతున్నాయి. మండలంలోని యర్రబాలెం సచివాలయం సమీపంలో ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీనిచుట్టూ పిచ్చిచెట్లు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న దాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. భవనాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పంచాయతీ రాజ్ జేఈ డేవిడ్ తెలిపారు.



ఆగిన హెల్త్ క్లినిక్ భవనం చుట్టూ పెరిగిన చిల్లచెట్లు

మద్యం దుకాణాలకు 1,102 దరఖాస్తులు

మార్కాపురం, పొదిలి, కంభం, యర్రగొండపాలెం : మార్కాపురం ప్రొహిబిషన్- ఎక్సైజ్‌శాఖ పోలీసు స్టేషన్ పరిధిలోని మార్కాపురం అర్బన్, మార్కాపురం మండలం, పెద్దారవీడు, దోర్నాల మండల పరిధిలో 13 మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి గడువు ముగిసిన సమయానికి 320 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేసుకునే వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. పోలీసు స్టేషన్‌లో దగ్గర ఉండి ఎక్సైజ్‌శాఖ పోలీసులు పర్యవేక్షణ చేశారు. పొదిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 292 దరఖాస్తులు ▶ పొదిలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాల కోసం 292 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ టి.ఇందిరకుమారి తెలిపారు. ఆన్‌లైన్ క్లోజ్ అయినందున, ఆఫ్‌లైన్‌లో సాయంత్రం ఐదు గంటల వరకు వరుసలో ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో 16 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ▶ కంభం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లో ఏర్పాటుకానున్న 10 మద్యం దుకాణాలకు 238 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ సీఐ కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. ▶ యర్రగొండాపాలెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 13 దుకాణాలకు గాను 252 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రయాణం సాగేదెలా..!

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : రాచర్ల మండలం అక్కపల్లి గ్రామ సమీపం నుంచి గిద్దలూరు- ఆకవీడు రోడ్డు వరకూ సుమారు 2 కిలో మీటర్లకుపైగా రహదారి కంకరరాళ్లతో అధ్వానంగా ఉంది. దీన్ని బాగు చేసేందుకు సుమారు మూడేళ్ల కిందట రోడ్డును తవ్వేశారు. మళ్లీ బాగు చేయలేదు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారంతా కంకర రాళ్లు తేలి ఉన్నాయి. పలువురు కిందపడి గాయాలపాలయ్యారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం, జేపీ చెరువు గ్రామాలకు వెళ్లేవారు చాలా మంది ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిని బాగు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు. రహదారిని బాగు చేయించేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. నిధులు మంజూరైతే బాగుచేయిస్తామని చెప్పారు.


కంకర తేలి అధ్వానంగా ఉన్న రోడ్డు

తుప్పు పడుతున్న యంత్రాలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మేజరు గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు ఘనవ్యర్థాల నిర్వహణతో సంపద సృష్టించేందుకు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అప్పట్లో ప్లాస్టిక్, ఇతరత్ర ఘనవ్యర్థాలను చిప్స్ చేసి దాన్ని నిల్వచేసేందుకు ప్రత్యేకంగా రెండు యంత్రాలు సైతం తెప్పించారు. వీటి విలువ లక్షల్లోనే ఉంటుంది. ప్రస్తుతం నగర పంచాయతీగా మారినప్పటికి డంపింగ్‌యార్డుగాని, సంపద తయారు కేంద్రంగానీ వినియోగంలోకి రాలేదు. విలువైన మోటార్లు, యంత్రాలు నగర పంచాయతీ మస్టర్ కేంద్రంలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా విలువైన యంత్రాలు తుప్పుపడుతున్నాయి. ప్రస్తుత అధికారులైనా దాన్ని వినియోగంలోకి తీసుకోరావాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా మారిన ప్లాస్టిక్ చిప్స్ చేసే యంత్రం

తపాలా కార్యాలయాల్లో పత్రాల కొరత

కంభం, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు తపాలా కార్యాలయాల్లో పత్రాల కొరత వేధిస్తోంది. నగదు వేసేవి, ఉపసంహరణ తదితర వాటికి సంబంధించిన పత్రాలు అందుబాటులో లేవు. దాంతో వినియోగదారులు, కార్యాలయాల సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ప్రజలే పత్రాలను జిరాక్స్ చేయించుకొని వినియోగించేకోవాల్సి వస్తోంది. కంభం పోస్టాఫీసులో సుమారు 900 మందికి పాసుపుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి అరకొరగా వస్తున్న పాసుపుస్తకాలను అత్యవసరమైన వారికి మాత్రమే కేటాయిస్తున్నారు. చాలా మందికి పాసుపుస్తకాలు ఇవ్వలేకపోతున్నామని పలు కార్యాలయాల సిబ్బంది చెబుతున్నారు.


మార్కాపురం పట్టణం: పెద్దయాచవరం గ్రామంలో బర్లీ పొగాకు పంటలో నిలిచిన నీరు

భారీ వర్షంతో రైతుల్లో ఆందోళన

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో బర్లీ పొగాకు, మిర్చి పంటలు నీటిలో మునిగాయి. మార్కాపురం మండలంలోని కొండేపల్లి, శివరాంపురం, వేములకోట దరిమడుగు, పెద్దయాచవరం, రాజుపాలెం, బోడపాడు తదితర గ్రామాలతో పాటు తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, సూరేపల్లి, బుడ్డపల్లి, కేతగుడిపి గ్రామాల్లోనూ వర్షం ధాటిగా కురిసింది. దీంతో ఇటీవల సాగు చేసిన మినుము పంట సైతం దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మరో నాలుగు వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెబుతుండటంతో రైతుల్లో గుబులు మొదలైంది.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పెద్దారవీడు, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయం నూతన ఎంపీడీవోగా ఎస్.జాన్ సుందరం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్‌కుమార్ త్రిపురాతంకం మండలానికి బదిలీపై వెళ్లగా, జిల్లా సీఈవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న జాన్ సుందరంను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు.


జాన్ సుందరం

వాడుక నీటికి ఇబ్బందులు

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నగర పంచాయతీ చట్రెడ్డిపల్లె గ్రామంలో ప్రజలు గత నాలుగు రోజులుగా వాడుక నీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న డీప్ బోర్లు అడుగంటడంతో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. ఇటీవల నగర పంచాయతీ అధికారులు నూతన డీప్ బోరు నిర్మాణం చేపట్టినప్పటికీ మోటారు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ట్యాంకర్ల వద్ద ప్రజలు నీటిని పట్టుకొనేందుకు ఘర్షణ పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని నూతన డీప్ బోరుకు మోటారు ఏర్పాటు చేసి నీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్లలో వీధి శునకాలు బెడద అధికమైంది. ఏ వీధిలో చూసినా కుక్కలు సంచారం కనిస్తోంది. మహిళలు, చిన్నారులు వీధుల్లోకి రావాలంటే జంకుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులను వెంబడిస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చూడాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మార్కాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్ద యాచవరంలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దార అల్లూరయ్యకు చెందిన పాడి గేదె విద్యుత్తు పరివర్తకం సమీపంలో గడ్డిని తింటూ ఎర్త్ తీగలను తాకడంతో మృతి చెందింది. పరివర్తకానికి ఎటువంటి రక్షణ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం వల్లనే గేదె మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పొదిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇ.అనిల్‌కుమార్, ఎస్.శివదిలిప్ చైతన్య, పి.సునీల్‌లు గాయపడ్డారు. క్షతగాత్రులను పొదిలి సామాజిక వైద్యశాలకు తరలించారు. వీరిలో ఇ.అనిల్‌కుమార్, ఎస్.శివదిలీప్ చైతన్యలకు రక్తగాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు సిఫారసు చేసినట్లు డాక్టర్ హేమంత్ తెలిపారు.

కంభం చెరువు అందాలు.. కనువిందు

కంభం, న్యూస్‌టుడే : కంభం చెరువు అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కాలంలో తటాకానికి కొత్తనీరు వచ్చి చేరింది. ఆ జలం తేరడంతో నీలిరంగులోకి మారాయి. చుట్టూ, చెరువులోని కొండలు పచ్చదనం పరుచుకోవడంతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. శుక్రవారం ఆకాశం నీలిరంగులో కనిపించడంతో తటాకంలోని జలం కూడా అదే రంగులో మారింది. కట్టకు మరోవైపు కనుచూపు మేర పచ్చదనంగా కనిపిస్తున్న పొలాలు ఆకట్టుకుంటున్నాయి. నిత్యం వందల మంది చెరువు అందాలను చూసేందుకు వస్తున్నారు. కట్టపై మాత్రం కనీస వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న మాటలు నీటి మూటలు గానే మిగిలిపోతున్నాయి. పర్యాటకంగా తీర్చిదిద్దితే ఎంతో అభివృద్ధి చెందుతుంది. చాలా మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రజలు, పర్యాటకులు కోరుతున్నారు.


కొండను తాకుతున్న నీలి మేఘం.. నీలి రంగులో నీరు ఆకట్టుకునేలా..


పచ్చటి పొలాలు, కొండ, ఆ పక్కనే ఉన్న గుంటూరు- గుంతకల్లు రైల్వే ట్రాక్

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య : ఎదురాళపాడు పంచాయతీ లోని కొత్తపల్లె నుంచి తువ్వపాడు వెళ్లే రహదారి రెండు వైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. తొలగించండి. – రమేష్, తువ్వపాడు

సమాధానం : పరిశీలించి ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఈశ్వరమ్మ, ఎంపీడీవో

కంభం, న్యూస్‌టుడే

సమస్య : హజరత్‌గూడెం వెళ్లే సిమెంట్ రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. – వెంకటేశ్వర్లు, స్థానికుడు



సమాధానం : ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తాం.
– జోష్యులు, పంచాయతీ కార్యదర్శి, హజరత్‌గూడెం


పేద కుటుంబంలో పుట్టి.. మెడికల్ సీటు సాధించి

పొదిలి, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎందులోనూ తీసిపోరని నిరూపించాడు పొదిలి టైలర్స్‌కాలనీకి చెందిన షాలేంరాజు. నిరుపేద కుటుంబానికి చెందిన షాలేంరాజు నీట్‌లో ర్యాంకు సాధించి కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు.

ప్రభుత్వ పాఠశాలలోనే... చదువు

తండ్రి గుంటూరి జోసఫ్‌కిషోర్ (పుల్లయ్య) ఫాస్టర్, తల్లి లుథియమ్మ గృహిణి. బాప్టిస్టుపాలెం ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదివాడు. ఇతని తెలివితేటను గుర్తించిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు అతనితో జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష రాయించారు. పొదిలిలోని బి.అశోక్‌రాజు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ప్రవేశపరీక్షలు మంచిమార్కులు సాధించడంతో ఆరు నుంచి ఇంటర్ వరకు మార్కాపురంలోని నవోదయలో చదివాడు. ఇంటర్ బైపీసీ పూర్తిచేసిన షాలేంరాజు ఈ ఏడాది నీట్ పరీక్ష పరీక్ష రాష్ట్ర స్థాయిలో 3వేల ర్యాంకు సాధించాడు. దీంతో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి సీటు సాధించడంతో ఉపాధ్యాయులు అభినందించారు.


కుటుంబ సభ్యులతో షాలేంరాజు

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో...

అయిదో తరగతిలోనే లెక్కలు బాగా చేస్తుండటంతో ఉపాధ్యాయులు గుర్తించి నాకు నవోదయ ప్రవేశానికి శిక్షణ ఇప్పించారు. అదే నా జీవితంలో మలుపు తిప్పింది. నవోదయలో చేరి బాగా చదువుకోగలిగా. నీట్‌లో ర్యాంకు సాధించా. మెడికల్ కళాశాలలో సీటు రావడంతో మా తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు. నన్ను ప్రోత్సహించిన మా ఉపాధ్యాయులు కృతజ్ఞతలు. – షాలేంరాజు.

ముండ్లమూరు, న్యూస్‌టుడే:

సమస్య: ముండ్లమూరు ప్రభుత్వ కార్యాలయల సముదాయం వద్ద చిల్లచెట్లు దట్టంగా మెలిచాయి. కొమ్మలు కార్యాలయల్లోకి వస్తున్నాయి. అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించాలి.
– వీరనారాయణ, ముండ్లమూరు

సమాధానం: చిల్లచెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – జనార్దన్, ఎంపీడీవో, ముండ్లమూరు

దొనకొండ, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని చందవరం గ్రామంలో వీధి కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించగలరు.
– కందుల ఆనంద్, చందవరం

సమాధానం: వారం రోజుల్లో కుక్కలను పట్టించి అడవిలో వదిలేలా చర్యలు తీసుకుంటాం.
– శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

గంగమ్మ.. నీవే మా దిక్కమ్మ..

తూర్పుగంగవరం(తాళ్లూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రాల్లో గుంటిగంగ ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడి గంగాభవాని అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా కొలువుదీరింది. ప్రతి ఆదివారం ప్రకాశం జిల్లాతోపాటు పరిసర బాపట్ల, పల్నాడు గుంటూరు, ఎన్టీఆర్ కృష్ణ జిల్లాతోపాటు నెల్లూరు పట్టణం, తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఏటా చైత్రమాసం బహుళ విదియ రోజున భారీగా తిరునాళ్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు మూడులక్షలకు పైగా భక్తులు తరలి వచ్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటున్నారు.


గంగాభవాని అమ్మవారి ఆలయ ప్రధాన ద్వారం

• పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే..

గుంటిగంగలో ఆదివారంతో పాటు ప్రధానమైన పర్వదినాల్లోనూ ఆలయం వద్ద ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం దసరా వేడుకలను పురస్కరించుకొని దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు జరగుతున్నాయి. గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారి ఆలయంతోపాటు పరిసరాల్లో శ్రీకృష్ణుడి మందిరం, రెండు శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయం కూడా ఉన్నాయి. కాశినాయన ఆశ్రమం వద్ద నిత్యాన్నదానం పథకం కొనసాగుతోంది. పంచకొండల నడుమ ఉన్న ఈప్రాంతం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇక్కడ చిన్నారులు ఆటలాడుకునేందుకు అనువుగా కొండలు, ఊయలలు, స్విమ్మింగ్ పూల్‌లు కూడా ఉన్నాయి. నాగంబొట్లపాలేనికి చెందిన దారం వెంగళరెడ్డి నాటిన సమారు 200పైగా మొక్కలు ప్రస్తుతం చెట్లయి ఎందరో బాటసారులకు నీడ నిస్తున్నాయి. ఇన్ని ప్రత్యేకలు ఉన్న గుంటిగంగను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు వీలుంది. ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

బాలిక చదువు.. భవిష్యత్తుకు వెలుగు

పామూరు, న్యూస్‌టుడే: బాలికల చదువు భవిష్యత్తుకు వెలుగని ఐసీడీఎస్ పర్యవేక్షకులు జి.పద్మజ, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లలోపు బాలికలు అందరు చదువుకోవాలన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దాదం-బతకనిద్దాం, చదవనిద్దాం-ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

దర్శి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పల్లె పండగ..పంచాయతీ వారోత్సవాల పేరుతో ఈ నెల 14 నుంచి 20 వరకు పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో ఉపాధి హామీ పనుల చేపట్టే పనుల గ్రౌండింగ్ చేయటానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్

విద్యారంగ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

కనిగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 12వ పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ప్రభుత్వం విద్యారంగ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతి వెంటనే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలని కాపాడాలని కోరారు. ప్రతి పాఠశాలలో రెండు మాధ్యమాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్, నాయకులు వెంకటేశ్వర్లు, జి.రామకృష్ణ, పొట్టేండ్ల మాలకొండయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

కనిగిరి, న్యూస్‌టుడే: బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని సీఐ షేక్ ఖాజావలి తెలిపారు. స్థానిక కార్యాలయంలో బాణసంచా దుకాణాదారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు పోలీస్, అగ్నిమాపక, మున్సిపాలిటీ శాఖల నుంచి అనుమతి తప్పనిసరి తీసుకోవాలని సూచించారు. అనధికారంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై టి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.మాధవరావు హెచ్చరించారు. మండలంలోని దాసరిపల్లిలో శుక్రవారం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. ఆటోలు, ద్విచక్రవాహన చోదలకులకు రోడ్డు భద్రతా నియమాలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 384 దరఖాస్తులు

కనిగిరి, సింగరాయకొండ, దర్శి, తాళ్లూరు, న్యూస్‌టుడే: సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త మద్యం విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానించింది. తొలుత గడువు 9వ తేదీతో ముగియగా.. ప్రభుత్వం మరో రెండో రోజులు పెంచింది. శుక్రవారంతో గడువు ముగిసింది. సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు, సింగరాయకొండ మండలాల పరిధిలోని 14 మద్యం దుకాణాలకు 385 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ శివకుమారి తెలిపారు. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వ ఆదాయం రూ.7.7 కోట్లు సమకూరిందని వివరించారు.● దర్శి నియోజకవర్గంలోని ఏర్పాటు చేసే మద్యం దుకాణాలకు మొత్తం 376 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 23 దుకాణాలకు ఈ దరఖాస్తులు రాగా, రుసుముగా రూ.7.52 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు వివరించారు. ● కనిగిరి ఎక్సైజ్ పరిధిలోని 5 మండలాల్లోని 19 దుకాణాలకు 384 దరఖాస్తులు వచ్చామని ఎక్సైజ్ సీఐ విజయ్ భాస్కర్ తెలిపారు.

కొండపి పొగాకు బోర్డులో ముగిసిన వేలం

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: 2023-24 పంట కాలానికి సంబంధించి కొండపి వేలం కేంద్రంలో వేలం కొనుగోలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మొత్తం 164 రోజులు వేలం నిర్వహించగా.. రైతులు పొగాకు చూర, ముక్క, పండుగుళ్ల బేళ్లను విక్రయించారు. మొత్తం 1,43,191 పొగాకు బేళ్లను కొనుగోలు చేయగా.. వీటి విలువ రూ.471 కోట్లు అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. పొగాకు గరిష్ఠ ధర రూ.362, సరాసరి ధర రూ.272.85, చూర, ముక్క, పండుగుళ్ల కిలో గరిష్ఠ ధర రూ. 199, సరాసరి ధర రూ.78.35 పలికిందన్నారు. ● కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం 403 చూర, ముక్క, పండుగుళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని కామేపల్లి, పచ్చవ, అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు, చౌడవరం, ముప్పవరం, చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి 622 బేళ్లు అమ్మకానికి తీసుకురాగా, అందులో 403 బేళ్లు కొనుగోలు చేశారు. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ.135, కనిష్ఠ ధర రూ.30 పలికిందన్నారు.


వేలం ముగియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న బోర్డు అధికారులు, కంపెనీల యాజమానులు, రైతులు

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి



మారెళ్లలో..



గుంటిగంగలో రాజరాజేశ్వరిగా గంగాభవాని అమ్మవారు



కనిగిరి: మహిసాసురమర్ధినిగా అమ్మవారు.

దుర్గమ్మా.. శరణు.. శరణు..

న్యూస్‌టుడే బృందం: దసరా ఉత్సవాలు కనులపండుగా సాగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైనా శుక్రవారం తాళ్లూరు మండలం గుంటిగంగలో ప్రఖ్యాతిగాంచిన గంగాభవాని అమ్మవారిని రాజరాజేశ్వరి అమ్మవారిగా అలంకరించారు. భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తి చాటుకున్నారు. కనిగిరి మండలంలోని నందనమారెళ్ల బాలకోటేశ్వర దేవస్థానం, పట్టణంలోని కన్యకాపరిమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు మహిసాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. మండలంలోని మారెళ్ల హరిహర దత్త క్షేత్రంలో మహిళలు పెద్దసంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొని పూజలు చేశారు. తాళ్లూరులో కొలువుదీరిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం రాత్రి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రానికి చెందిన కళాకారులు డప్పు వాయిద్యాలు, కథకాళి వేషధారణలతో ప్రజలను అలరించారు. కురిచేడులో తిరుపతమ్మ అమ్మవారు ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు కోలాటం ప్రదర్శించారు.



కొండపి: పెద్దకండ్లగుంట గ్రామంలో మహాకాళీ అవతారంలో దర్శనిమిస్తున్న పార్వతీ దేవి



టంగుటూరులో...



పొనకొండలో మహాకాళి



తాళ్లూరు: ప్రత్యేక వేషధారణల్లో కేరళ కళాకారులు



దర్శి: ప్రత్యేకాలకంరణలో పోలేరమ్మ తల్లి



సింగరాయకొండ: మహిసాసుర మర్దిని దేవిగా చెట్టు మహాలక్ష్మమ్మ



పామూరులో ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కేజీబీవీల్లో నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

పీసీపల్లి, హనుమంతునిపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో స్వీపర్, వంట మండేందుకు సహాయకురాలు పోస్టుల కోసం దరఖాస్తు స్వీకరణ నోటిఫికేషన్ జారీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు సంజీవ్, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళ అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ❖ హెచ్‌ఎంపాడు కేజీబీవీ పాఠశాలలో మహిళా వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఎంఈవో తెలిపారు.

దర్శిలో మానవతా సేవలు

దర్శి, న్యూస్‌టుడే: సమాజంలో అనాథలుగా జీవించటమే కష్టంగా మారిన ప్రస్తుత తరుణంలో మృతి చెందిన సమయంలో వారి అంత్యక్రియలు నిర్వహించటం అసాధ్యంగా మారింది. ఇలాంటి వారికి మేమున్నాం అంటూ ముందుకు వస్తున్నారు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు. అనాథలు, పేదలకు చివరి మజిలీ గౌరవంగా సాగేలా తోడ్పాటు అందిస్తున్నారు. ఆపదలో కష్టాల్లో ఉన్న అభాగ్యులకు, పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రారంభించిన అతి తక్కువ రోజుల్లోనే అనేక కార్యక్రమాలు నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



రోగులకు మందులు, వస్తువులు అందిస్తున్న సభ్యులు

❖ 550 కి చేరిన సభ్యుల సంఖ్య..

రెండు నెలల క్రితం దర్శిలో 10 మంది సభ్యులతో సంస్థ ప్రారంభమైంది. వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ వర్గాలకు చెందిన వారు సంస్థలో చేరుతుంటే అతి తక్కువ కాలంలో సభ్యుల సంఖ్య 550కి చేరింది. వీరు ఏడాదికి దాదాపు రూ.5 లక్షల వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేలా లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఎవరికైనా ఆపదొస్తే.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా, కుటుంబ పోషణ ఇబ్బందిగా మారినా, చదువులకు ఇబ్బంది పడుతున్నా, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా వీరి దృష్టికి వస్తే వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇటీవలె దర్శికి సమీపంలోని వెంకటాచలం కొండకు సమీపంలో ఉన్న కాశీనాయన ఆశ్రమంలో మృతి చెందిన నలుగురు వృద్ధులకు అంత్యక్రియలు నిర్వహించి చివరి మజిలీ గౌరవంగా సాగేలా చేశారు. రోగులకు మందులు, ఆహారం, ఇతర వస్తువులు ఉచితంగా అందిస్తున్నారు. ఎవరైనా మృతి చెందితే వారి బాధ్యులకు అండగా ఉండేందుకు సాయం అందిస్తున్నారు. అంత్యక్రియల సమయంలో ప్రత్యేక వాహనం (వైకుంఠ రథం) ఏర్పాటు చేస్తున్నారు.

సమాజ సేవే లక్ష్యంగా..



సమాజంలో ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో సంస్థ తరఫున సాయం అందిస్తున్నాం. సభ్యులు కొంత నగదును సమకూర్చటంతో పాటు దాతల సాయంతో మరికొంత సేకరించి సేవలు చేపడుతున్నాం. రాబోయే రోజుల్లో సేవలను మరింత విస్తరించటానికి ప్రయత్నాలు చేస్తున్నాం.
– వెంకటరెడ్డి, అధ్యక్షుడు,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, దర్శి.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కనిగిరి న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని వెంకటేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సతీసమేత వెంకటేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామి వారికి 500 మంది దంపతులు సామూహిక కల్యాణాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా శ్రీనివాసుడిని పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంచారు.



ప్రత్యేకాలంకరణలో వెంకటేశ్వర స్వామి



సామూహిక కల్యాణాల్లో పాల్గొన్న దంపతులు

తపాలాతో ప్రజలకు మెరుగైన సేవలు

కొండపి గ్రామీణం: ప్రజలకు మెరుగైన సేవలను తపాలా శాఖ అందిస్తోందని సౌత్ సెంట్రల్ డివిజనల్ అధికారి రవికుమార్ రెడ్డి తెలిపారు. కొండపిలో సిబ్బందితో కలిసి శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ అందిస్తున్న పొదుపు పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొండపి ఉప పోస్టుమాస్టర్ అశోక్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ పరామర్శ

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని విధులు నిర్వహిసున్న పీసీపల్లి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బి.రవికుమార్ ఈ నెల 8న హఠత్తుగా రోడ్డుపై పడిపోయారు. ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయన్ను, కుటుంబ సభ్యులను శుక్రవారం ఎస్పీ దామోదర్ వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

బీసీ చైతన్య సమితి జిల్లా ప్రతినిధి నియామకం

పామూరు, న్యూస్‌టుడే: జాతీయ బీసీ చైతన్య సమితి జిల్లా అధికార ప్రతినిధిగా పామూరుకు చెందిన ఓగూరు ఏడుకొండలు ఎన్నికయ్యారు. పామూరులోని అంకాలమ్మ దేవస్థానంలో శుక్రవారం జాతీయ బీసీ చైతన్య సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ మాట్లాడుతూ.. బీసీ నాయకులు సంఘటితమై సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నికైన ఏడుకొండలకు నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.ప్రసాద్, ఓ.శివ, బి.నాగేశ్వరరావు, వి.మల్లికార్జున, టి.నాగయ్య, సీహెచ్.వాసు, బి.బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏడుకొండలకు నియామకపత్రం అందజేస్తున్న బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రమణ

టంగుటూరులో బంగారు గొలుసు అపహరణ

టంగుటూరు, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ సంఘటన టంగుటూరు విష్ణు ఆలయం రోడ్డులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పమిడి రంగమ్మ (72) పోలేరమ్మ ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. విష్ణు ఆలయం వద్ద ద్విచక్ర వాహనంపై గుర్తుతెలియని యువకులు చిరునామా అడుగుతున్నట్లు నటించి మెడలోని గొలుసు అపహరించుకుపోయారు. దీంతో కంగుతిన్న వృద్ధురాలు బోరున విలపిస్తూ వారి వెంట పడగా దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

జూదరుల అరెస్టు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో శుక్రవారం జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఆర్.సుమన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,980 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

వరద బాధితులకు చేయూత

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఒంగోలుకు చెందిన వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కొటికలపూడికి చెందిన 200 మంది వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, దుప్పట్ల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామకృష్ణ, గుడివాడ బాబ్జి, మల్లికార్జునరావులతోపాటు కొండపల్లి పురపాలికకు కౌన్సిలర్ పులి అరుణ, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులు అందిస్తున్న వింగ్స్ సంస్థ ప్రతినిధులు


మామిడి ఆకులు కొంటున్న మహిళలు


ఓ వస్త్ర దుకాణంలో రద్దీ

మార్కెట్‌కు పండగ కళ

అమ్మవారి పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో నగరంలోని అన్ని మార్కెట్లు శుక్రవారం కళకళలాడాయి. కొత్త మార్కెట్, అద్దంకి బస్టాండ్ ప్రాంతంలోని పూల దుకాణలు కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాల్లో సైతం పండగ సందడి కనిపించింది.

– ఈనాడు, ఒంగోలు

విజయ దశమి శుభాకాంక్షలు

Advt Spl. Feature

శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి




త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనేదుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసనలకీమూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్నిపవిత్రమైన ఈ శరన్నవరాత్రులతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి అమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి




సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అధిష్ఠాన దేవత, శ్రీగాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గా అంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని) రక్షించేది అని. గాయత్రికి పేరు. అలాగే ఛాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనం మాట్లాడే వాక్కే గాయత్రీ అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి



అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారం అటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవి తనబిడ్డమైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్ని ప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈ జీవకోటి నశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం. "బిక్షాందేహి కీపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"

శ్రీ మహాలక్ష్మీ దేవి



శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మీ స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనే ఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనే ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)



చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకల విద్యలనూ ప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసే అలంకారానికి ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగా లక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి అమ్మ అనుగ్రహాన్ని కానుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారు మూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి



త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టి త్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితా త్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్ని అనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో అదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)



అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురుకుమారుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణి సంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది. ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా కొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి



మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ శరీరాల్లోంచి దివ్య తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆ తేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ ఆయుధాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహారించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహారించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి



అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్ఠాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగా కొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ చెరకుగడను చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక. "చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు



ఎమ్మెల్యే బీఎన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీవోఏలు

తోడ్పాటు అందించాలని వీవోఏల వినతి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండల డ్వాక్రా వీవోఏలు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

నగరాభివృద్ధికి రూ.9 కోట్లు!

◆ 15వ ఆర్థిక సంఘం, ఎన్ క్యాప్ నిధుల మంజూరు

న్యూస్‌టుడే - ఒంగోలు నగరం

నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.9 కోట్ల నిధులు అందుబాటులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కేంద్రం నుంచి వచ్చిన తొలి గ్రాంట్లు ఇవే. ఎన్నికల ఏడాదిలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదు. ఆ మొత్తాన్ని పట్టణాలు, నగరాల వారీగా ఇప్పుడు కేటాయించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒంగోలుకు రూ.9.49 కోట్లు మంజూరు కాగా... ఇందులో రూ.5 కోట్లు అమృత్ పథకం వాటాగా మినహాయిస్తారు. మిగిలిన రూ.4.49 కోట్లు... తాగు నీటి సంబంధమైన పనులకు ఖర్చు చేసుకునేలా మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కమిటీలో తీర్మానించిన పనులను... కౌన్సిల్ ఆమోదంతో చేపట్టనున్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

పీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్ క్యాప్) కింద గత అయిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగరానికి రూ.4.50 కోట్లు కేటాయించారు. దీనికి కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్లు, కాలువలు, పార్కుల నిర్మాణం, మొక్కల పెంపకం తదితర పనులు చేపట్టవచ్చు. మొత్తం మీద రెండు గ్రాంట్లలో రూ.5 కోట్లు పోనూ మిగిలిన రూ.8.99 కోట్లతో వెంటనే ఆయా పనులు చేపట్టే వీలుంది. గతంలో మాదిరిగా సీఎఫ్ఎంఎస్‌లో బిల్లుల సమస్య లేకుండా కొత్తగా ఏర్పాటు చేసిన పీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించనున్నారు. ఈ నిధులతో ఏ పనులు చేపట్టాలనేది నగరపాలక సంస్థ కమిషనర్, ఇంజినీర్లు ప్రతిపాదనలు తయారు చేసి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు సమర్పించారు. అధికారులతో చర్చించి పనులు ఖరారు చేయనున్నారు. త్వరలోనే అత్యవసర పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గ్రానైట్ తనిఖీ కేంద్రాల ఏర్పాటు

చీమకుర్తి, సంతనూతలపాడు - న్యూస్‌టుడే: గ్రానైట్ రాళ్లు, స్లాబ్‌ల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చీమకుర్తి మండలం శివారు మర్రిచెట్లపాలెం-ఉప్పలపాడు మధ్య ఒకటి; పేర్నమిట్టలో మరొకటి శుక్రవారం ప్రారంభించారు. తగిన వే బిల్లులు లేకుండా పెద్ద ఎత్తున రవాణా చేస్తున్న విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో... జిల్లా కలెక్టర్ సూచన మేరకు వీటిని ఏర్పాటు చేశారు. 24 గంటలూ అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్

కడప క్రీడలు: ఏసీఏ అండర్-14 పురుషుల క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం ప్రకాశంతో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రెండోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 70 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటయింది. అనంతరం ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 88/3 స్కోరు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.

చీమకుర్తిలో చిరు జల్లులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో గత నాలుగు రోజులుగా చీమకుర్తి ప్రాంతంలో వర్షపు జల్లులు పడుతున్నాయి. కాసేపు ఎండ, తరువాత వాన అన్న చందంగా రోజంతా చినుకులు పడుతూనే ఉన్నాయి. అక్టోబర్ నెలలో సగటు వర్షపాతం 262 మి.మీ. కాగా... ఇప్పటి వరకు సుమారుగా 40 మి.మీ. మాత్రమే పడింది. మరోవైపు వాతావరణమూ వేడిగానే ఉండడం గమనార్హం.

విజయ దశమి శుభాకాంక్షలు

Advt Spl. Feature

శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి

త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనేదుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసనలకీమూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్నిపవిత్రమైన ఈ శరన్నవరాత్రులలతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి అమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి

సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, నిద్రుమ, హేమ, నీల, ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అధిష్ఠాన దేవత, శ్రీగాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గా అంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని) రక్షించేది అని. గాయత్రికి పేరు. అలాగే ఛాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనం మాట్లాడే వాక్కే గాయత్రీ అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి

అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారం అటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవి తనబిడ్డమైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్ని ప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈ జీవకోటి నశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం. "భిక్షాందేహి కృపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"

శ్రీ మహాలక్ష్మీ దేవి

శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మి స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనే ఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనే ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)

చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకల విద్యలనూ ప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసే అలంకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగా లక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి అమ్మ అనుగ్రహాన్ని కానుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారు మూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి

త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టి త్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితా త్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్ని అనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో అదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)

అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురుకుమారుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణి సంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది. ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి, మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా కొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి

మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ శరీరాల్లోంచి దివ్య తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆ తేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ ఆయుదాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహరించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి

అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్ఠాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగా కొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ చెరకుగడను చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక. "చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"

విశాఖను టాప్‌-5 నగరాల్లో నిలుపుతాం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు మంత్రి లోకేశ్‌ హామీ


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొనియాడారు. ఉండవల్లి నివాసంలో లోకేశ్‌తో శుక్రవారం ఆయన భేటీ అయ్యారు. విశాఖకు టీసీఎస్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ తెచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ నగరం, పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. 'బీచ్‌ రోడ్డును వివిధ జోన్లుగా అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మరింత ఊపు వస్తుంది. భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమయ్యే నాటికి ఎలివేటెడ్‌ కారిడార్లు, ఫ్లైఓవర్లు సమాంతరంగా అభివృద్ధి చేయాలి. నగరంలో ట్రాఫిక్‌ నియంత్రణకు ప్రణాళికలు రూపొందించాలి. త్వరగా మెట్రో ప్రాజెక్టు కార్యరూపం దాల్చేలా చూడండి' అని లోకేశ్‌ను గంటా కోరారు. విశాఖను దేశంలోనే టాప్‌-5 నగరాల్లో ఒకటిగా నిలపనున్నట్టు ఈ సందర్భంగా లోకేశ్‌ తెలిపారు. వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో ఇసుకను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

రూ. 225 కోట్ల స్థలం.. రూ. 15 లక్షలకే

ఎలా కట్టబెట్టారు?

● శారదా పీఠానికి కేటాయించిన భూములపై పునఃపరిశీలన

ఈనాడు, విశాఖపట్నం: గత వైకాపా ప్రభుత్వం కారుచౌకగా అప్పగించిన విలువైన భూములపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వాటిని ఏ ప్రాతిపదికన కట్టబెట్టారో పరిశీలిస్తోంది. ముఖ్యంగా విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదా పీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో ఎకరం రూ. లక్ష చొప్పున 15 ఎకరాలు కేటాయించారు. బహిరంగ మార్కెట్‌లో అక్కడ ఎకరం రూ. 15 కోట్ల వరకు ఉంది. అంటే ఆ భూమి మొత్తం విలువ రూ. 225 కోట్లు. అంతటి విలువైన స్థలాన్ని కేవలం రూ. 15 లక్షలకే నాటి వైకాపా ప్రభుత్వం అప్పగించింది. దీనిపై పునఃపరిశీలన చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నివేదిక కోరింది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతిని జగన్‌ రాజగురువుగా పలువురు భావించారు. ఈ నేపథ్యంలో వేద విద్యాలయం ఏర్పాటు పేరుతో సముద్ర తీరానికి సమీపంలో ఉన్న ఆ భూములపై దృష్టి సారించారు. గురువు కోరిందే తడవుగా 2021లోనే భీమిలికి సమీపంలో సర్వే నంబరు 102/2లో 7.70 ఎకరాలు, 103లో 7.30 ఎకరాలు.. మొత్తం 15 ఎకరాలు కేటాయించారు. వీటిని రూ. 22.5 కోట్లకు కేటాయించొచ్చని నాటి ప్రభుత్వానికి నివేదిక వెళ్లింది. అవేమీ పట్టించుకోని అప్పటి ప్రభుత్వ పెద్దలు కేవలం రూ. 15 లక్షలకు కారుచౌకగా అప్పగించేశారు. పీఠానికి స్థలం కేటాయించడంతో వైకాపా ప్రభుత్వం ఆగలేదు. కింద నుంచి నేరుగా కొండ మీదకు రోడ్డు వేసే విషయంలో విమర్శలు వస్తాయని.. ఆదేశాల మేరకు విశాఖ మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చింది. అలా పీఠం స్థలం మీదుగా అక్కడికి రోడ్డు నిర్మించడం గమనార్హం. ఎన్నికలకు ముందు ఈ ఏడాది జనవరిలో ఆ భూములను వేద పాఠశాలకు కాకుండా వాణిజ్య, నివాస, రెవెన్యూ అవసరాలకు ఉపయోగించుకునేలా పాత ఉత్తర్వులను సవరించి ఇవ్వాలని సీఎంకు పీఠం లేఖ రాసింది. అయితే అధికారులు అడుగులు వేసినా.. మార్పులు మాత్రం చేయలేదు.


శారదా పీఠానికి కేటాయించిన భూములివే

తుది నిర్ణయంపై

శారదా పీఠానికి కేటాయించిన స్థలంపై తుది నిర్ణయం తీసుకోవాలని కొద్ది రోజుల కిందట భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌ విశాఖ జిల్లా కలెక్టర్‌ను నివేదిక కోరారు. అక్కడ స్థల ప్రాధాన్యం.. ఏ అవసరానికి వినియోగించవచ్చు, గతంలో పీఠానికి ఎకరం ఎంతకు కేటాయించారు, అప్పటి అధికారులు ఎంతకు ఇవ్వొచ్చని ప్రతిపాదించారు వంటి వివరాలు పొందుపర్చినట్లు సమాచారం. గతంలో విశాఖ జిల్లాలో ప్రజావసరాల పేరుతో కేటాయించిన భూములను ప్రస్తుతం ఏవిధంగా వినియోగిస్తున్నారన్న వివరాలతోపాటు మధురవాడలో ఉపాధి అవసరాలకు కేటాయించిన ఒక స్థలాన్ని ప్రస్తుతం ఆదిత్యనాథ్‌ పేరుతో వినియోగిస్తున్న వైనాన్ని ఉదహరించినట్లు తెలిసింది.

జరిమానా విధించేందుకు కారణాలు నమోదు చేయాలి

● ఆదాయపు పన్నుశాఖ అధికారులకు స్పష్టం చేసిన హైకోర్టు

● రూ.6.65 కోట్ల జరిమానా విధింపు ఉత్తర్వుల రద్దు

ఈనాడు, అమరావతి: అసెస్‌మెంట్‌ ఉత్తర్వుల్లో సంతృప్తికరమైన కారణాలను నమోదు చేయకుండా ఆదాయపు పన్ను చట్టం ప్రకారం జరిమానా విధించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఓ వ్యాపారికి రూ.6.65 కోట్ల జరిమానా విధిస్తూ సంయుక్త కమిషనర్‌ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ జి.నరేందర్‌, జస్టిస్‌ ఎం.కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. ఆదాయపు పన్ను చట్టంలోని ఓ సెక్షన్‌ నిబంధనలకు విరుద్ధంగా అమరేందర్‌ అనే వ్యాపారి రూ.6.65 కోట్లను నగదు రూపంలో రుణంగా తీసుకున్నారు.. అంతే మొత్తంలో అధికారులు జరిమానా విధించారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఆ వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్‌ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మదింపు(అసెస్సింగ్‌) అధికారి జరిమానా విధించేందుకు గల కారణాలను నమోదు చేయకుండా అసెస్‌మెంట్‌ ఉత్తర్వులను సంయుక్త కమిషనర్‌కు పంపారన్నారు. వాటి ఆధారంగా సంయుక్త కమిషనర్‌ రూ.6.65 కోట్ల జరిమానా విధించారని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. జరిమానా విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది.


పట్టుబడిన గంజాయి

అదుపుతప్పిన కారులో.. 538 కేజీల గంజాయి

● నిందితుల పరారీ


గుంతలో కూరుకుపోయిన కారు

పాడేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం చింతలవీధి కూడలి వద్ద శుక్రవారం భారీఎత్తున గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఓ వాహనం తెల్లవారుజామున చింతలవీధి గ్రామంలోని రోడ్డు పక్కన ఓ రేకుల ఇంట్లోకి దూసుకెళ్లి గుంతలో దిగబడింది. ఎంత ప్రయత్నించినా కారు బయటకు రాకపోవంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పాడేరు పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలించారు. కారులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దాన్ని బయటకు తీసి తూకం వేయగా 538 కేజీల గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని సీఐ దీనబంధు తెలిపారు. కారుతో పాటు గంజాయిని పాడేరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడిన సరకు విలువ రూ. 27 లక్షల వరకు ఉంటుందని సీఐ పేర్కొన్నారు. పాడేరు ఎస్సై సూర్యనారాయణ, వీఆర్‌ఓ రామునాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్రీహోల్డ్‌' భూముల రిజిస్ట్రేషన్లలో మూడోవంతు అక్రమాలే

● అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో గోల్‌మాల్‌

● వైకాపా పాలనలో అక్రమాలపై కొనసాగుతున్న పరిశీలన

● రద్దుపై న్యాయనిపుణులతో సంప్రదింపులు

ఈనాడు, అమరావతి: ఫ్రీ-హోల్డ్‌ భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు నిత్యం బయటపడుతూనే ఉన్నాయి. నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన లక్షల ఎకరాల్లో.. 25,230 ఎకరాలకు సంబంధించి జరిగిన రిజిస్ట్రేషన్లలో మూడోవంతు నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు తేలింది. వీటిని రద్దు చేసే క్రమంలో చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం న్యాయనిపుణులను సంప్రదిస్తోంది. అన్నమయ్య జిల్లాలో 2,097 ఎకరాలు, చిత్తూరు-1,101, ప్రకాశం-651, తిరుపతి-592, నంద్యాల జిల్లా-442 ఎకరాలను నిబంధనలకు వ్యతిరేకంగా రిజిస్ట్రేషన్లు చేసేశారు. పేదలకు భూములు కేటాయించిన తరవాత 20 ఏళ్లు దాటితేనే ఫ్రీహోల్డ్‌ చేసి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలి. నాటి వైకాపా పాలనలో నేతల సిఫార్సులతో ఇలాంటి నిబంధనలను తుంగలో తొక్కేశారు. నాటి వైకాపా పాలనలో నిషిద్ధ జాబితాలోని భూములకు యజమాన్య హక్కులు కల్పించారు. ఎసైన్డ్‌ భూములు, ఇనాం భూములు, చుక్కల భూములు, షరతులున్న భూముల కింద మొత్తం 13,59,804 ఎకరాలను నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి నాటి వైకాపా ప్రభుత్వం తొలగించింది ఇందులో ఇప్పటివరకు...1.14 లక్షల ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా తప్పించారు. వీటిని మరోమారు పరిశీలిస్తుండగా.. రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిలోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. వీటి విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ఇప్పుడు రెవెన్యూ శాఖకు పెద్ద సవాలుగా మారింది.

20 ఏళ్లు పూర్తికాకున్నా..

రిజిస్ట్రేషన్లు జరిగిన 25,230 ఎకరాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా 7,547 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందులో 20 ఏళ్లు పూర్తికాని ఎసైన్డ్‌ భూములు 830 ఎకరాలు ఉన్నాయి. యాజమాన్య హక్కుల కల్పన జీవో 595ను నాటి ప్రభుత్వం 2023 డిసెంబరు 19న జారీ చేసింది. ఈ తేదీకి 20 ఏళ్లకు ముందు కేటాయించిన ఎసైన్డ్‌ భూములకే ఈ జీవో వర్తిస్తుంది. అయితే 2003 తరవాత లబ్ధిదారులకు ఇచ్చిన భూములను కూడా నిషిద్ధ జాబితా నుంచి తప్పించడం గమనార్హం. తమకు అనుకూలంగా ఆన్‌లైన్‌లో ఆప్షన్లను మార్చుకొని.. రెవెన్యూ సిబ్బంది పేట్రేగిపోయారు. అన్నమయ్య జిల్లాలో 265, చిత్తూరు-268, తిరుపతి-69, ప్రకాశం-50, నంద్యాలలో 72 ఎకరాలకు గడువు విషయం పట్టించుకోకుండానే రిజిస్ట్రేషన్‌ చేశారు. మరోవైపు జిల్లా కలెక్టర్ల ఆమోదం లేకుండానే మరో 800 ఎకరాల ఎసైన్డ్‌ భూములకు (శ్రీసత్యసాయి జిల్లాలో 511, అన్నమయ్య-173, చిత్తూరు-48 ఎకరాలకు) రిజిస్ట్రేషన్లు జరిగాయి.

మరో 150 ఎకరాలకు సంబంధించిన వివరాలు రికార్డుల్లో లేకున్నా...రిజిస్ట్రేషన్లు జరిగిపోవడం సంచలనాన్ని కలిగిస్తోంది. ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో ఈ దారుణాలు ఎక్కువగా నమోదయ్యాయి. ఎసైన్డ్‌ భూములకు సంబంధించి ఆధారాలు స్పష్టంగా లేకున్నా.. .. శ్రీసత్యసాయి జిల్లాలో 780 ఎకరాలు, అన్నమయ్య-629, చిత్తూరు-443, నంద్యాల జిల్లాలో 297 ఎకరాలకు రిజిస్ట్రేషన్‌ జరిగినట్లు సమాచారం.

పోరంబోకు భూములకూ

కోర్టు వివాదాల్లో ఉన్న 57 ఎకరాలకు, ప్రభుత్వ పోరంబోకు 302 ఎకరాలకు కూడా రిజిస్ట్రేషన్లు జరిగాయి. అన్నమయ్య జిల్లాలో 144, తిరుపతిలో 112, నెల్లూరు జిల్లాలో 22 ఎకరాలను అన్యాక్రాంతం చేశారు. కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు లేకున్నా కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

20 నాటికి పరిశీలన పూర్తిచేయాలని ఆదేశాలు

నిషిద్ధ జాబితా నుంచి తొలగించిన భూముల వివరాల పరిశీలన ఈ నెల 20వ తేదీనాటికి పూర్తి చేయాలని కలెక్టర్లను రెవెన్యూ శాఖ ఆదేశించింది. అలాగే నిబంధనలకు వ్యతిరేకంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించిన భూముల వివరాలను కూడా మరోసారి పరిశీలించాలని కోరింది. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం బాధ్యులను నిర్ధారించి, శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించాలని రెవెన్యూ శాఖ భావిస్తోంది.


చెన్నకేశవస్వామి ఆలయంలో...


కాశీవిశ్వేశ్వరుని దేవస్థానంలో..


సంతపేట: బాబా మందిరంలో..


లాయర్‌పేట: సాయి ఆలయంలో..

మముబ్రోవు మహిషాసుర మర్దిని

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం... మహిషాసుర మర్దినిగా అమ్మవారు భక్తులను కరుణించారు. ఉదయం ఆయా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆయా మండపాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఊంజల్‌ సేవ నిర్వహించారు. అన్నమాచార్య సంకీర్తనావళి మైమరపించింది.

– న్యూస్‌టుడే, బృందం


శ్రీగిరిలో పూజలందుకుంటున్న స్వామివారు


పెళ్లూరు: మహిషాసుర మర్దినిగా...


ఈతముక్కలలో


పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే జనార్దన్‌ దంపతుల పూజలు


సంతనూతలపాడు: అంకమ్మకు విశేష అలంకరణ


ఉప్పుగుండూరులో...


అమ్మనబ్రోలులో...


గుండ్లాపల్లిలో...


చీమకుర్తి హరిహర క్షేత్రంలో...


మద్దిపాడులో...

పల్లె ప్రగతికి కూటమి ఊపిరి

● ఒంగోలు, సంతనూతలపాడుకు రూ.34.75 కోట్లు

● 14 నుంచి అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఒంగోలు మండలం యరజర్లలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం

గత వైకాపా ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. వసతుల కల్పన మాట అటుంచితే... కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులనూ లాక్కోవడంతో గ్రామాల్లో కనీస పారిశుద్ధ్య పనులూ చేపట్టలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పల్లె ప్రగతిని పట్టాలెక్కించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దారుణంగా ఉన్న రోడ్లు, కాలువల బాగుకు నిర్ణయించింది. ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించి... చేపట్టాల్సిన పనులకు ఆమోదం తీసుకుంది. ఈ నెల 14 నుంచి 21 వరకు నిర్వహించనున్న 'పల్లె పండగ' వారోత్సవాల్లో వాటికి శంకుస్థాపన చేయనుంది. ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలకు సంబంధించి గ్రామాల వారీగా చేపట్టనున్న పనుల షెడ్యూలను ఎంపీడీవోలు ఇప్పటికే ఖరారు చేశారు.

వైకాపా తీరుతో కుదేలైన పంచాయతీలు...

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఖర్చు చేసే బడ్జెట్‌కు అదనంగా నలభై శాతం మొత్తాన్ని మెటీరియల్‌ కాంపొనెంట్‌గా కేంద్రం ఇస్తుంది. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ఈ మొత్తాన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల ఏర్పాటు, శ్మశానవాటికల అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం వంటి పనులకు కేటాయించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం చాలావరకు నిధులను దారి మళ్లించడంతో పల్లెల్లో అభివృద్ధి పనులు పడకేశాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌, పాల కేంద్రాల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చినా... ఎక్కువ శాతం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓటర్లకు గాలం వేసేందుకు సీసీ రోడ్లు మంజూరు చేసినా... బిల్లులు రావన్న భయంతో పనులు చేపట్టేందుకు వైకాపా నాయకులు సైతం ముందుకు రాలేదు. ఈ లోటుపాట్లను సరిచేసేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పంచాయతీలు కొత్త రూపు సంతరించుకునే అవకాశం ఉంది.


మద్దిపాడు: జాతీయ రహదారి సమీపంలో కాలువ దుస్థితి

'పల్లె పండగ'లో భాగంగా ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న పనుల వివరాలు...

ఒంగోలు నియోజకవర్గం...

రూ.14.40 కోట్లతో 360 సీసీ రోడ్లు...

రూ.15 లక్షలతో మరో గ్రావెల్‌ దారి నిర్మించనున్నారు.

మండలం	సీసీ రోడ్లు	నిధులు (రూ.కోట్లలో)
ఒంగోలు	174	6.90
కొత్తపట్నం	186	7.50

సంతనూతలపాడు నియోజకవర్గం...

రూ.15.55 కోట్లతో 99 సీసీ రోడ్డు పనులు

రూ.4.65 కోట్లతో 30 కాలువల నిర్మాణం చేపట్టనున్నారు.

మండలం	సీసీ రోడ్లు	నిధులు	కాలువలు	వెచ్చించనున్నది (రూ.కోట్లలో)
మద్దిపాడు	29	3.30	9	1.70
నాగులుప్పలపాడు	40	8.65	11	1.50
సంతనూతలపాడు	30	3.60	10	1.45

రెండు కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.కోటి ఖర్చవుతుందని అంచనా. ఆ లెక్కన రెండు నియోజకవర్గాల్లో అరవై కిలోమీటర్లకు పైగా పల్లె దారులు అభివృద్ధి చెందనున్నాయి.

గ్రానైట్‌ ఎగుమతుల నేపథ్యంలో చీమకుర్తి మండల పరిషత్‌కు సాధారణ నిధుల లభ్యత ఎక్కువగా ఉన్నందున... ఆ మండలాన్ని మినహాయించారు



శుక్రవారం ఉదయం... మస్తాన్‌ దర్గా కూడలిలో వర్షంలోనూ కళారాలను చూసేందుకు వచ్చిన భక్తులు

కళారాల జాతర

దసరా సందర్భంగా గురువారం రాత్రి నగరంలో నిర్వహించిన కళారాల సంబరం అంబరాన్నంటింది. కళాకారుల ప్రదర్శనలు, కేరళ వాయిద్యాలు, యువత కేరింతల మధ్య ఊరేగింపు కనులపండువగా సాగింది.


గంటాపాలెంలో...

దాండియా అదరహో...

ఒంగోలులోని అర్జున్‌ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాండియాలో ఉత్తరాది రాష్ట్రాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. బిగ్‌బాస్‌ ఫేం శుభశ్రీ పాల్గొని సందడి చేశారు.

– ఈనాడు, ఒంగోలు


దాండియా ఆడుతున్న రాజస్థానీ యువత